సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 21 । మే । 2023



సేవలకు సలాం

నిత్యం ప్రజా సేవలో నిమగ్నమవుతున్న వలంటీర్లను ఏటా వివిధ అవార్డులతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు మూడో విడతకు శ్రీకారం చుట్టింది. దీనిపై కథనం. 8లో ▸



యానాం మద్యం స్వాధీనం

యానాం నుంచి భారీగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంటలో నిందితుడిని అరెస్ట్ చేశారు. 8లో ▸



కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

న్యూస్‌రీల్

హైకోర్టు చీఫ్ జస్టిస్‌ని కలిసిన కలెక్టర్



హైకోర్టు చీఫ్ జస్టిస్ శేషసాయిని కలసిన కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్): రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి తన స్వగ్రామమైన భీమవరం వచ్చారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆయన గృహానికి వెళ్లి జస్టిస్ శేషసాయిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన్ని కలిసినవారిలో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ బి.శ్రీనాథ్, తహసీల్దారు వై.రవికుమార్ తదితరులు ఉన్నారు.

పాలిసెట్‌లో పాలకొల్లు విద్యార్థికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్



యశ్వంత్ సాత్విక్

పాలకొల్లు సెంట్రల్: ఏపీ పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పాలకొల్లు విద్యార్థి కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. శనివారం విడుదలైన ఈ ఫలితాల్లో యశ్వంత్ 120కి 120 మార్కులు సాధించాడు. పాలకొల్లుకు చెందిన కోటిపల్లి వెంకట సత్యనారాయణ, గీతా వాణిలకు యశ్వంత్ మూడో కుమారుడు. యశ్వంత్ అన్న తేజ భోపాల్‌లో ఎన్ఐటీలో చదువుతున్నాడు. రెండో అన్న బాలు ఇంటర్‌మీడియట్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సిద్ధమవుతున్నట్టు తల్లిదండ్రులు తెలిపారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన యశ్వంత్ శనివారం 'సాక్షి'తో మాట్లాడుతూ.. తాను ఇంటర్‌మీడియట్ చదివి ఐఐటీలో సీటు సాధించాలని భావిస్తున్నట్టు చెప్పాడు.

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

భీమవరం (ప్రకాశంచౌక్): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు జిల్లాలో సులభతర వ్యాపారం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, వాటిపై నేరుగా వారికే ఫోన్ చేసి వారి అభిప్రాయాలు తెలుసుకునే కార్యక్రమం చేపడుతున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సులభతర వ్యాపారంపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక వేత్తలకు ఒకరోజు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించాలనుకునే వారికి సింగిల్ విండో విధానం ద్వారా అన్ని అనుమతులూ ఆన్‌లైన్ ద్వారా ఒకే పోర్టల్‌లో సేవలందించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు, అనుమతుల సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అనే విషయాలు, పొందిన లబ్ధి తదితర అంశాలపై ఆరా తీస్తారని వివరించారు. తద్వారా లోపాలు సరిచేసి పారిశ్రామికవేత్తలు ప్రోత్సాహం అందించడమే దీని లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా 75 అంశాలతో కూడిన పోస్టర్‌ను కలెక్టర్‌తో పాటు డీఆర్వో కె.కృష్ణవేణి, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కె.వెంకటేశ్వరరావు, లేబర్ డిప్యూటీ డైరెక్టర్ ఆకుల లక్ష్మి, డ్రగ్ కంట్రోల్ అధికారి మల్లికార్జునరావు తదితరులు ఆవిష్కరించారు.

సైబర్ క్రైమ్‌పై స్పెషల్ ఫోకస్

- ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు నిపుణులు
- జిల్లాల వారీగా ప్రత్యేక శిక్షణకు ప్రణాళిక
- గత మూడేళ్లుగా పెరుగుతున్న మోసాలు
- లోన్ యాప్స్, ఆన్‌లైన్ గేమ్‌ల పేరుతో భారీ దోపిడీ
- ఫేస్‌బుక్ పరిచయాలతో మహిళలను మోసగిస్తున్న కేసులు
- కేసుల పర్యవేక్షణకు నోడల్ అధికారిగా దిశ డీఎస్పీలు
- ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి సమగ్ర అవగాహన



సాక్షిప్రతినిధి, ఏలూరు : లోన్ యాప్స్ పేరుతో మోసాలు.. ఫేక్ చిరునామాతో ఫేస్‌బుక్ పరిచయాలతో మహిళలను మోసగిస్తున్న ఘటనలు.. ఆన్‌లైన్ గేమ్‌ల పేరుతో లక్షలకు లక్షల వసూళ్లు, ఓటీపీల సాయంతో బ్యాంకు ఖాతాల్లో నగదు స్వాహా.. ఇలాంటి కేసులు నిత్యకృత్యంగా మారాయి. పోలీస్ శాఖ పదే పదే అవగాహన కల్పిస్తున్నా మోసకారుల వలలో చిక్కుకుని అనేక మంది నష్టపోతున్నారు. మరోవైపు సైబర్ క్రైమ్ కేసులు కూడా ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం ఏలూరు రేంజ్ డీఐజీ ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి సైబర్ క్రైమ్ చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు కేసులను త్వరితగతిన పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించారు. దీంతో పాటు ఆయా కేసులు, సైబర్ నేరాలపై జిల్లాల వారీగా విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

నరసాపురానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడి మరింత డబ్బు రావాలంటే క్యాష్ డిపాజిట్ చేయాలనడంతో.. ఒకటి కాదు రెండు కాదు రూ.30 లక్షలు డిపాజిట్ చేసి నష్టపోయానని పోలీసుల ఎదుట ఘొల్లుమన్నాడు. నరసాపురానికి చెందిన ఓ యువతిని చిత్తూరు జిల్లాకు చెందిన యువకుడు ఫేస్‌బుక్ ద్వారా పరిచయం పెంచుకుని ట్రాప్ చేసి భారీగా వసూలు చేశాడు. ఇలాంటి కేసులు తరచూ నమోదవుతూనే ఉన్నాయి. ఈ కేసుల్లో పలువురు బాధితులకు న్యాయం చేస్తున్నప్పటికీ నమోదవుతున్న కేసుల సంఖ్య మాత్రం పెరుగుతూనే ఉంది. ప్రధానంగా మహిళా సంబంధిత నేరాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో సైబర్ క్రైమ్, ఎన్‌డీపీఎస్ యాక్ట్‌పై అవగాహన కల్పించాలని ఏలూరు రేంజ్ పోలీస్‌లు నిర్ణయించుకున్నారు. ప్రధానంగా రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో ఉన్న కొంతమంది ట్రైనర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. వారి ద్వారా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు సిబ్బందికి వీరు శిక్షణ ఇవ్వనున్నారు. సైబర్ క్రైమ్ కేసులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసేలా చట్టాలపై అవగాహనతో పాటు సత్వర న్యాయం చేసేలా చర్యలు తీసుకోవడానికి వీలుగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో రాజమండ్రి నగరంలో మాత్రమే సైబర్ పోలీస్‌స్టేషన్ ప్రత్యేకంగా ఉంది. మిగతా జిల్లాల్లో ఎస్పీ కార్యాలయాల్లో సైబర్ సెల్ పనిచేస్తుంది. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో శిక్షణ పొందిన ఇద్దరు కానిస్టేబుళ్లు ఫిర్యాదులు స్వీకరించి కేసు నమోదు చేసి సైబర్ సెల్‌కు పంపడంతో పాటు కేసు ఫాలోఅప్ చేసి బాధితులకు న్యాయం జరిగే వరకు చూసేలా ఆదేశాలిచ్చారు.

గడచిన ఆరేళ్లలో నమోదైన కేసులు ఇవీ...

జిల్లా	2018	2019	2020	2021	2022	2023	మొత్తం
కాకినాడ	26	62	29	56	52	8	233
కోనసీమ	8	21	32	40	38	64	203
తూర్పుగోదావరి	51	98	120	89	160	48	566
ఏలూరు	64	84	101	51	75	29	404
పశ్చిమగోదావరి	14	55	56	41	70	28	266
కృష్ణా	49	91	69	26	77	20	332
మొత్తం	212	413	407	303	472	192	2004

ఆన్‌లైన్‌లో రూ.30 లక్షలు దోచేశారు...

నర్సాపురం పట్టణానికి చెందిన ఎంవీ బద్రీనాథ్ ఉన్నత విద్యావంతుడు. తండ్రి వ్యాపారవేత్త. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఓ ఎంఎన్‌సీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ప్రస్తుతానికి ఇంటి వద్దే ఉంటూ వర్క్ ఫ్రం హోం పద్ధతిలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి ఆన్‌లైన్‌లో టాస్క్‌లిచ్చి మనీ గెలుచుకునే అవకాశం ఉందంటూ కొన్ని వెబ్‌సైట్ల నుంచి లింకులు వచ్చాయి. దీంతో అతను ఆ టాస్క్‌లను తీసుకుని చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో అతనికి రెండు, మూడు విడతలుగా రూ.15 వేలు క్రెడిట్ చేశారు. మళ్లీ కొన్ని టాస్క్‌లు గెలిచారు రూ.25 లక్షలు చెల్లిస్తే మీకు దానికి నాలుగు రెట్లు సొమ్ము వస్తుందంటూ ఆశ చూపారు. దీంతో బద్రీనాథ్ గత నెల 11 నుంచి 14 వరకు వారు సూచించిన వివిధ ఖాతాల్లో రూ.27 లక్షలు జమ చేశాడు. వారి వద్ద నుంచి మళ్లీ ఏ సమాధానం రాకపోవడంతో కాంటాక్ట్ చేయగా ట్యాక్స్ రూపంలో రూ.3 లక్షలు చెల్లించాలని అక్కడి నుంచి సమాధానం వచ్చింది. దీంతో అతను ఆ సొమ్ము కూడా చెల్లించాడు. మళ్లీ సమాధానం రాకపోవడంతో ఆరా తీయగా, ఇంకో రూ.5 లక్షలు చెల్లిస్తే మొత్తం సొమ్ము మీ అకౌంట్‌కు క్రెడిట్ అవుతుందని సమాధానం వచ్చింది. దీంతో ఆలోచనలో పడిన బద్రీనాథ్ తాను మోసపోయానని గుర్తించాడు. గత నెల 15న నర్సాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇలాంటి ఘటనలు ఇటీవల ఎన్నో చోటు చేసుకుంటున్నాయి.

నోడల్ అధికారులుగా దిశ డీఎస్పీలు



దిశ డీఎస్పీ సైబర్ సెల్‌కు జిల్లా స్థాయిలో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ప్రతి ఫిర్యాదుపై డీఎస్పీ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకున్నాం. మహిళా సంబంధిత మోసాలు కూడా ఎక్కువగా వస్తుండటంతో దిశ డీఎస్పీలు సమగ్ర అవగాహన ఉండటంతో సైబర్ సెల్ బాధ్యతలు అప్పగించనున్నాం. డీఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక టీమ్, నేరాల నిర్వహణకు, ఫిర్యాదుల పరిష్కారానికి పనిచేసేలా సచివాలయాల పరిధిలో ఉన్న మహిళా పోలీసుల ద్వారా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం. ప్రతి గ్రామంలో మహిళా పోలీసులు అందుబాటులో ఉన్నారు. పాఠశాల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అవగాహన కల్పిస్తారు. – జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు రేంజ్ డీఐజీ

ఏడాది క్రితమే చేతులెత్తేసిన చంద్రబాబు, పవన్

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా



తాడేపల్లిగూడెం అర్బన్ : పొత్తు లేకుండా పోటీ చేయలేని చంద్రబాబు, తనకు ముఖ్యమంత్రి అయ్యేంత సీన్ లేదని పవన్ కల్యాణ్ చెప్పడం ద్వారా ఏడాది క్రితమే చేతులెత్తేశారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. తాడేపల్లిగూడెంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజల గుండెల్లో దేవుడయ్యారని చెప్పారు. ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్న జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేమని ఒప్పుకోవడం ద్వారా తెలుగుదేశం, జనసేన పార్టీలు బరిలోకి దిగకుండానే తోకముడిచాయన్నారు. దీనిని బట్టి ఆ రెండు పార్టీలూ తమ ఓటమిని ఏడాది ముందుగానే అంగీకరించినట్లయిందని చెప్పారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని ప్రతిపక్ష పార్టీలే ఢంకా మోగించి చెబుతున్నాయన్నారు. 14 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు నాయకత్వంలో 40 ఏళ్ల తెలుగుదేశం పార్టీ 2019 ఎన్నికల్లోనే చచ్చిపోయిందన్నారు. కేవలం పచ్చమీడియాలోనే తెలుగుదేశం పార్టీ బతుకుతోందని విమర్శించారు. 2024 ఎన్నికలు టీడీపీకి, చంద్రబాబుకు చివరివని స్పష్టం చేశారు. దేవుడు ప్రత్యక్షమై ఏమి కావాలో కోరుకోమంటే మంచి జరగాలని అందరూ కోరుకుంటారని, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు మాత్రం రాష్ట్రంలో అమలు చేస్తున్న మంచిని చూసి తట్టుకోలేక చెడు జరగాలని కోరుకుంటారని విమర్శించారు. ఇంతకాలం బీజేపీతో పెళ్లి, తెలుగుదేశంతో సంసారం చేసిన పవన్ ఇప్పుడు తనతో పాటు తెలుగుదేశం, బీజేపీలను కూడా కలిసి రావాలని చెప్పడం తాను సంసారం చేస్తున్న వారితో మరొకరిని సంసారం చేయాలని ఆహ్వానించినట్లుందన్నారు. దీన్ని ఏమంటారో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. ఇంత బజారు రాజకీయాలు చేస్తున్న పవన్‌కల్యాణ్‌ను చూసి జనసైనికులే అసహ్యించుకుంటున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకొని అధికారం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రజల గుండెల్లో వైఎస్ జగన్ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ స్పష్టం చేశారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

సత్కార సభలో మంత్రి కారుమూరి



తణుకులో అవార్డులు అందుకున్న వలంటీర్లతో మంత్రి కారుమూరి, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్సీ రవీంద్ర

తణుకు అర్బన్: సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడంలో వలంటీర్ల సేవలు అభినందనీయమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మున్సిపాలిటీ, రూరల్ పరిధిలో అవార్డులు పొందిన వలంటీర్లను మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. తణుకు జెడ్పీ బాలుర హైస్కూలు క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి కారుమూరి మాట్లాడుతూ తమకు అప్పగించిన 50 ఇళ్లలో వలంటీరు ఒక పెద్దబిడ్డలా సేవలందిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రజలు సైతం వారింట ఏ శుభకార్యం వచ్చినా ముందుగా వలంటీరునే పిలిచే పరిస్థితి ఉందన్నారు. కోవిడ్ సమయంలో రెడ్ జోన్స్‌లో వలంటీర్లు అందించిన సేవలు అజరామరమని కొనియాడారు.

వలంటీర్లకు అవార్డులు అందించడం శుభపరిణామం...

వలంటీర్ల సేవలు గుర్తించి జగనన్న ప్రభుత్వం వారికి అవార్డులు అందించడం శుభపరిణామమని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ఏపీలోని వలంటీరు వ్యవస్థను పార్లమెంట్ సైతం ప్రశంసించిందని గుర్తుచేశారు.

పారదర్శకంగా వలంటీరు వ్యవస్థ...

ప్రజల జీవన ప్రమాణాలు పెంచే క్రమంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలులో వలంటీరు వ్యవస్థ చాలా పారదర్శకంగా పనిచేస్తుందని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. సచివాలయ వ్యవస్థలో జిల్లాలో 9600 మంది వలంటీర్లు తమకు అప్పగించిన ఇళ్లకు సేవలందిస్తున్నారని చెప్పారు. అంతటి గౌరవాన్ని ఇచ్చిన ప్రభుత్వానికి వలంటీర్లు అంతా ధన్యవాదాలు తెలపాలని సూచించారు. ఈ సందర్భంగా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు పొందిన వారికి ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్, తణుకు మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ ఎం.సూర్యతేజ, రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలి

పార్టీ శ్రేణులకు మిథున్‌రెడ్డి దిశా నిర్దేశం



పార్టీ ముఖ్య శ్రేణులతో చర్చిస్తున్న పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

పాలకొల్లు అర్బన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లులో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆ పార్టీ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కోరారు. పాలకొల్లులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. పలు అంశాలను చర్చించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్ సీపీ కమిటీలన్నీ ఉత్సాహంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌కి సూచించారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

హైకోర్టు సీజేగా శేషసాయి నియామకంపై హర్షాతిరేకాలు



ఆకుల వెంకటశేషసాయి

సాక్షి, భీమవరం : రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా భీమవరం పట్టణానికి చెందిన ఆకుల వెంకట శేషసాయి నియమితులు కావడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి చెందిన వెంకట శేషసాయి భీమవరం పట్టణంలో 1962 జూన్ మూడో తేదీన ఆకుల నర్సింహ అప్పారావు (కొండాజీ), మంగతాయారు దంపతులకు జన్మించారు. శేషసాయి తాత ఆకుల సత్యం భీమవరం పంచాయతీ ప్రెసిడెంట్‌గా, భీమవరం మున్సిపాలిటీ మొట్టమొదటి వైస్ చైర్మన్‌గా సేవలందించారు. తండ్రి ఆకుల కొండాజీ కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు కాగా తల్లి మంగతాయారు గృహిణి. శేషసాయి భార్య గీత గృహిణి కాగా, కుమారుడు శ్రీ సాయికృష్ణ భార్గవ్ హైకోర్టు న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. కుమార్తె సూర్యశిరీష మెడికల్ విద్యనభ్యసిస్తున్నారు.

విద్యాభ్యాసం ఇలా...

వెంకట శేష సాయి ప్రాథమిక విద్యాభ్యాసం భీమవరం మున్సిపల్ పాఠశాల, లూథరన్ హైస్కూల్, ఇంటర్‌మీడియట్ విద్య కేజీఆర్ఎల్ కళాశాలలో సాగింది. న్యాయ విద్య ఏలూరు సీఆర్ రెడ్డి లా కళాశాలలో అభ్యసించారు. 1987 జూలై మూడున బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. అనంతరం సీనియర్ న్యాయవాది పి.రాజగోపాల్‌రావు, పి.రాజారావు వద్ద న్యాయవాద వృత్తిపై శిక్షణ పొందారు. శేషసాయి ప్రధానంగా సివిల్, క్రిమినల్, సర్వీస్, రాజ్యాంగ సంబంధిత కేసులు వాదించడంలో మంచి దిట్ట. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాదుకు స్టాండింగ్ కౌన్సిల్‌గా, స్టేట్ బార్ కౌన్సిల్‌కు ప్యానెల్ అడ్వకేట్‌గా వ్యవహరించారు.

పోలవరం ప్రాజెక్టుపై ప్రభుత్వం తరపున అడ్వకేట్‌గా..

ఒడిశా రాష్ట్రం పోలవరం ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో వేసిన కేసులో రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్‌గా వ్యవహరించారు. శేషసాయి 2013లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు అడిషనల్ జడ్జిగా 2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టుకు జడ్జిగా నియమితులయ్యారు. 2019లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన శేషసాయి.. తాజాగా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమితులు కావడంతో జిల్లాలోని ఆయన స్నేహితులు, న్యాయవాదులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. శనివారం భీమవరం వచ్చిన శేషసాయిని పలువురు అధికారులు, న్యాయవాదులు, మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

యానాం మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు



నిందితుడు, మద్యం బాటిళ్లతో ఎస్‌ఈబీ అధికారులు

ద్వారకాతిరుమల: యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒక వ్యక్తిని మండలంలోని రాళ్లకుంటలో అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఈబీ సీఐ సుబ్రహ్మణ్యం శనివారం చెప్పారు. యానాంకు చెందిన గంగాధర రామ్మూర్తి తన గ్రామం నుంచి ఒక కారులో రాళ్లకుంటకు మద్యం బాటిళ్లను అక్రమంగా తీసుకొస్తున్నట్టు సమాచారం అందుకున్న ఎస్‌ఈబీ అధికారులు వలపన్ని అతడిని పట్టుకున్నారు. శనివారం రాత్రి అతడి ఇంటిపై దాడి చేసి అతని నుంచి 936 మద్యం బాటిళ్లు, ఒక కారు, రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ నక్క సూర్యచంద్రరావుకు అందిన సమాచారం, సూపరింటెండెంట్ అరుణకుమారి ఆదేశాల మేరకు ఈ దాడిని జరిపినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ దాడిలో ఎస్‌ఈబీ ఎస్‌ఐ సుబ్బారావు, హెడ్ కానిస్టేబుళ్లు సీతారాం, కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ మూర్తి, నీలాద్రిపురం జీఎంఎస్‌కే నస్రిన్ పాల్గొన్నారు.

సేవలకు సలాం

- వరుసగా మూడో ఏడాది వలంటీర్లకు అవార్డులు
- పశ్చిమగోదావరి జిల్లాలో 8,533 మంది ఎంపిక
- ప్రోత్సాహక నగదు బహుమతులుగా రూ.8.73 కోట్లు



వలంటీర్‌కు సేవా పతకం అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ఇంటి ముంగిటికే వెళ్లి అందించడం, పారదర్శకంగా పథకాలను లబ్ధిదారులకు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారు. ఆయన ఆశయాలను నేరవేరుస్తూ సంక్షేమ సారథులుగా వలంటీర్లు చిత్తశుద్ధితో సేవలు అందిస్తున్నారు. కేవలం గౌరవ వేతనంతో ప్రజలకు సేవలు అందిస్తున్న వారిని ఏటా ప్రభుత్వం నగదు బహుమతులతో ప్రోత్సహిస్తూ సన్మానిస్తోంది. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పేరిట అవార్డులు అందజేస్తోంది. సేవా మిత్రకు రూ 10 వేలు, సేవా రత్నకు రూ.20 వేలు, వజ్రకు రూ 30 వేలు చొప్పున ఏటా నగదు పురస్కారం అందిస్తోంది. ఇప్పటికే రెండు విడతల పురస్కారాలు అందించిన ప్రభుత్వం ఈఏడాది మూడో విడత పురస్కారం అందించే కార్యక్రమం నిర్వహిస్తోంది.

35 మందికి వజ్ర సేవా అవార్డులు

పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 9,263 వలంటీర్లు ఉండగా మూడో విడతలో అవార్డులు అందుకున్నవారు 8,533 మంది ఉన్నారు. ఈరిలో సేవా మిత్ర అవార్డు అందుకున్న వారు 8,370 మంది, సేవా రత్న అవార్డుకు 128 మంది, సేవా వజ్ర అవార్డు అందుకున్న వారు 35 మంది ఉన్నారు. ప్రభుత్వం వలంటీర్ల అవార్డుల కోసం మూడో విడత కింద రూ 8.73 కోట్లు ఖర్చుచేసింది. ఆయా నియోజకవర్గాలు, మండల స్థాయిలో వలంటీర్లకు వందనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం 19న ప్రారంభం కాగా 10 రోజుల పాటు నిర్వహిస్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమకు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించడమే కాక తమ సేవలను గుర్తించి ఏటా అవార్డు, నగదు బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తుండటం చాలా సంతోషంగా ఉందని వలంటీర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో ప్రజలకు మరింత బాధ్యతగా, ఉత్సాహంగా సేవలు అందిస్తామని వలంటీర్లు చెబుతున్నారు.



నరసాపురంలో వలంటీర్లకు నమూనా చెక్కును అందజేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

జిల్లాలో నియోజకవర్గాల వారీగా అవార్డులకు ఎంపికైన వలంటీర్ల వివరాలు

నియోజకవర్గం	సేవా మిత్ర	సేవా రత్న	సేవా వజ్ర
ఆచంట	1,083	20	6
భీమవరం	1,276	17	5
నర్సాపురం	986	15	5
పాలకొల్లు	948	15	4
తణుకు	1,361	20	5
తాడేపల్లిగూడెం	1,382	16	5
ఉండి	1,334	25	5
మొత్తం	8,370	128	35

వజ్ర అవార్డు రావడం సంతోషంగా ఉంది



నేను గతంలో రెండు సార్లు సేవా మిత్ర అవార్డు అందుకున్నాను. మూడోసారి సేవా వజ్ర అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు సేవ చేస్తూ ప్రభుత్వం నుంచి అవార్డు అందుకోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను. వలంటీర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, సీఎం సార్‌కు కృతజ్ఞతలు.

– జిల్ల జీవన్‌కుమార్, వలంటీర్, ఎల్‌ఎస్‌పీ పురం

మరింత బాధ్యతగా సేవలందిస్తా



నేను రెండు సార్లు సేవా మిత్ర అవార్డులు అందుకున్నాను. నా సేవలు గుర్తించి ప్రభుత్వం ఇప్పుడు వజ్ర అవార్డు అందించడం సంతోషంగా ఉంది. సీఎం సార్ ఇచ్చిన ఈ ప్రోత్సాహంతో మరింత బాధ్యతగా సేవలు అందిస్తాను. వలంటీర్‌గా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యునిగా చూడడం అదృష్టంగా భావిస్తున్నాను.

– ధనాల సోమేశ్వరరావు, వలంటీర్, 18వ వార్డు, భీమవరం

సేవ చేసే అవకాశం కలిగింది



రెండు సార్లు సేవా మిత్ర అవార్డులు అందుకున్నాను. మూడోసారి సేవా రత్న అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం ప్రతి ఏడాది వలంటీర్లకు అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు అందిస్తుండటం గొప్ప విషయం. నా పరిధిలో కుటుంబాలకు మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు కృషి చేస్తా

– జంగం మేరీ, వలంటీర్, 21వ వార్డు, భీమవరం

ఘాటెక్కిన అల్లం ధర

తణుకు: అల్లం ధర ఘాటెక్కింది. నిన్నామొన్నటి వరకు కిలో ధర రూ.80 ఉండగా ప్రస్తుతం మార్కెట్‌లో రూ.200 పలుకుతోంది. సాధారణంగా వేసవిలో ఉల్లి, పచ్చిమిర్చి ధరలు పెరుగుతుంటాయి. అయితే ప్రస్తుతం అల్లం ధర రెండింతలు పెరగడంతో వినియోగదారులు కొనుగోలు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో అల్లం దిగుబడి తగ్గిపోవడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు ఉత్తరాది రాష్ట్రాలకు సైతం ఇక్కడి నుంచే ఎగుమతులు అవుతుండటంతో డిమాండ్ మరింత పెరిగింది. గత ఏడాది ఇదే సీజన్‌లో కిలో ధర రూ.60 నుంచి రూ.80 మాత్రమే ఉంది.

ధర పెరిగినా.. నాణ్యత లేదు

జిల్లా వాణిజ్య కేంద్రమైన తాడేపల్లిగూడెం మార్కెట్‌కు ప్రధాన అపరాలతోపాటు అల్లం పెద్ద ఎత్తున దిగుమతి అవుతుంది. ఇక్కడి నుంచే జిల్లాలోని ప్రధాన కేంద్రాలకు వ్యాపారులు సరఫరా చేస్తుంటారు. ప్రధానంగా తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లోని అల్లం పండే ప్రాంతాల నుంచి వ్యాపారులు గూడెం మార్కెట్‌కు తరలిస్తుంటారు. అయితే ఈ ఏడాది పెరిగిన వేసవి ధాటికి దిగుబడి ఒక్కసారిగా పడిపోయింది. ఈ పరిస్థితుల్లో డిమాండ్ పెరిగి దిగుబడి తగ్గింది. గతంలో వారానికి అయిదు లోడులు జిల్లాకు వస్తే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని వ్యాపారులు చెబుతున్నారు. దర పెరిగినప్పటికీ నాణ్యమైన అల్లం మార్కెట్‌కు రాకపోవడంతో నాసిరకం సరుకు అందుబాటులో ఉంటోంది.

బాస్కెట్‌బాల్ బాలికల జట్టు విజేత తూర్పుగోదావరి



తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్సీ కవురు



కృష్ణా జిల్లా బాలుర జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

- బాలుర జట్టు విజేత కృష్ణా
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్
- ఉల్లంపర్రులో ముగిసిన కవురు శ్రీనివాస్ కప్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రు మాంటిస్సోరీలో గత నాలుగురోజులుగా నిర్వహించిన కవురు శ్రీనివాస్ కప్ రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఫైనల్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు కృష్ణా జిల్లా బాలికల జట్టుపై 55/43 పాయింట్ల తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. అలాగే కృష్ణా జిల్లా బాలుర జట్టు తూర్పుగోదావరి జట్టుపై 62/40 పాయింట్ల తేడాతో విజయం సాధించి కవురు శ్రీనివాస్ కప్ ట్రోఫీని గెలుచుకున్నారు. విజేతలకు శుక్రవారం రాత్రి ఉల్లంపర్రు క్రీడా ప్రాంగణంలో బహుమతులు అందజేశారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మానసిక వికాసంతో పాటు శారీరక వికాసం కూడా పెంపొందించుకోవాలని, దీనికి క్రీడాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.చెంగల్ నాయుడు, ప్రధాన కార్యదర్శి జి.చక్రవర్తి, కోశాధికారి బి.రేవతి, జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, చీఫ్ కోచ్ ఎం.రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి జి శ్రీనివాస్, కోశాధికారి, కె.మురళీకృష్ణ, మాంటిస్సోరీ విద్యాసంస్థల అధిపతులు మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసు, మాంటిస్సోరీ స్కూల్ ప్రిన్సిపాల్ సామవేదం వసంతలక్ష్మి పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్: కొత్తూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పాలకోడేరు: వేండ్ర గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కొత్త జంటకు ఆశీర్వాదం



నరసాపురం మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్ కుమార్తె సుకీర్తి, రాష్ట్ర మాజీ మంత్రి దివంగత జక్కంపూడి రామమోహన్‌రావు కుమారుడు గణేష్‌ల పరిణయ నిశ్చితార్థ వేడుక శనివారం పాలకొల్లులో వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, మంత్రులు అంబటి రాంబాబు, దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణుగోపాల శ్రీనివాస్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ ఈ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

- పాలకొల్లు అర్బన్

గాలివాన బీభత్సం



జట్లపాలెంలో రహదారికి అడ్డంగా విరిగిన చెట్టు కొమ్మలు

తాడేపల్లిగూడెం: పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో పిడుగులు పడటంతో ప్రజలు ఆందోళన చెందారు. ఈదురుగాలులకు విద్యుత్ సరఫరా నిలిచి ఒక్కసారిగా అంధకారం నెలకొంది. తాడేపల్లిగూడెం మండలంలో విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడటంతో వైర్లు తెగిపోయాయి. నియోజకవర్గం మొత్తంలో 20 వరకు విద్యుత్ స్తంభాలు ధ్వంసమైనట్లు ఎలక్ట్రికల్ డీఈ వెంకటేశ్వరరావు చెప్పారు. పొలాల్లో విరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిన వైర్లను శనివారం యుద్ధప్రాతిపదికన చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

తెగిన విద్యుత్ తీగలు

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలు ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు ఒరిగి తీగలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. శనివారం విరిగిన చెట్ల కొమ్మలను తొలగించగా విద్యుత్ మరమ్మతులు పూర్తి చేసి మధ్యాహ్నం సరఫరాను పునరుద్ధరించారు.

తాటిచెట్టు కూలి రైతు మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

పెనుగొండ: ఈదురుగాలులు ప్రారంభం కావడంతో ధాన్యం రాశిని కాపాడుకుందామని వెళ్లిన ఓ రైతును తాటి చెట్టు మృత్యురూపంలో కబళించింది. శనివారం రాత్రి సిద్ధాంతం శివారు ఘటాల దిబ్బలో పొలంలో ఉన్న ధాన్యం రాశిపై బరకాలు కప్పడానికి వెళ్లగా రాసి వద్దే ఉన్న తాడి చెట్టు ఈదురుగాలులకు ఒక్కసారిగా రైతు పులిరాము (65)పై కూలిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. అతనికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఈ ఘటనలో స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. పెనుగొండ సిఐ జీవీవీ నాగేశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

గూడెంలో 18 మి.మీ. వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 18 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వైకేవీ అప్పారావు శనివారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 20 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎఫ్‌సీఐ కాలనీ రోడ్డు నెంబర్ 6లో శనివారం చలివేంద్రం ప్రారంభించారు. వాహనదారులకు, పాదచారులకు మజ్జిగ, కూల్ వాటర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ మాట్లాడుతూ ఎండలు మండుతున్నందున దాతలు పట్టణంలోని అనేక ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కేవీ చలం, పి.కుమారస్వామి, పి.పరమాత్మ, డి.నాగరాజు, నూకరాజు, నరసింహమూర్తి, వెంకట్రావు యోహాన్, ఏఆర్‌కే సత్యనారాయణ మూర్తి, గురుమూర్తి, వనచర్ల ప్రసాద్, సారధి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌కు సత్కారం



ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్ : ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌ను జిల్లా బీసీ సంక్షేమ సంఘ నాయకులు కలసి సత్కరించారు. శనివారం తేతలి ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని వంకా రవీంద్రనాథ్‌ను బీసీ సంఘం నాయకులు కలసి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈకార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు రంధి అప్పారావు, షేక్ మస్తాన్, ఎస్ సీతారామరాజు, గౌరు నాయుడు, తణుకు సత్యనారాయణ, షేక్ చిన భాషా తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జడ్డు హరిబాబు

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను నవాబుపాలెం సొసైటీ చైర్మన్ జడ్డు హరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడాస్ఫూర్తిని నింపుకోవాలన్నారు. విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. తొలి రోజు తాడేపల్లిగూడెం - ఉప్పరగూడెం, వెంకట్రావుపాలెం - మోదుగగుంట, జువ్వలపాలెం - కడియద్ద టీమ్‌ల మధ్య పోటీలు జరిగాయి. ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, నిర్వాహకులు గంధం రమేష్ (బాబి), ప్రత్తి రాజుబాబు, తారమట్ల శ్రీనివాస్, అంగిన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన జేసీబీ

సాక్షి, భీమవరం: నిర్లక్ష్యంగా జేసీబీతో కారును ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడినట్టు విజయవాడ విద్యాధరపురానికి చెందిన కె.కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం వెంకటేశ్వరరావు శనివారం చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కోటేశ్వరరావు మరొక నలుగురు విజయవాడ నుంచి భీమవరం వచ్చి శుక్రవారం తిరిగి వెళుతుండగా పట్టణంలోని విస్సాకోడేరు వంతెన వద్ద నిర్లక్ష్యంగా వచ్చిన జేసీబీ వాహనం ఢీకొట్టిందని ఈ ప్రమాదంలో కారులో ఉన్న సాయికృష్ణ, గోపికృష్ణ, మల్లేశ్వరి గాయపడ్డారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

ప్రత్యేక కారాగారం తనిఖీ

సాక్షి, భీమవరం: పట్టణంలోని ప్రత్యేక కారాగారాన్ని ఒకటవ అధనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ సురేష్‌బాబు శనివారం తనిఖీచేశారు. ముందుగా వంటశాల, కూరగాయలు, జైలు ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న రోజువారీ ఆహార పదార్థాలు, విజిటింగ్ డాక్టర్ ఎప్పుడెప్పుడు వస్తున్నారనే విషయాలను ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. ముద్దాయి క్రమశిక్షణ, పరివర్తన, బాధ్యతతో ఉండాలని ఆర్థి కస్థోమత లేనివారికి మండల న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బి.సురేష్ కుమార్, జైల్ పర్యవేక్షణా ఇన్‌చార్జ్ అధికారి ఎ కుమార్ స్వామి, కిషోర్ పాల్గొన్నారు.

చంద్రబాబు అహంకారానికి పరాకాష్ట

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కొత్తూరులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్ : పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇళ్ల స్థలాలు అందించడంతోపాటు ఇళ్లు నిర్మించి ఇస్తూ ఉంటే, పేదలకిస్తున్న సెంటు భూమిని సమాధితో చంద్రబాబు పోల్చడం అతని అహంకారానికి పరాకాష్ట అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ఏనాడూ సెంటు భూమిని కూడా పేదలకు పంచిన పాపానపోలేదని ఆయన దుయ్యబట్టారు. తాడేపల్లిగూడెం మండలం కొత్తూరు గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించడంతోపాటు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతో పెళ్లి.. చంద్రబాబుతో పవన్ కాపురం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నీచుడు.. దుర్మార్గుడు అయిన చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడానికి కంకణబద్ధులై పనిచేస్తున్నారని, దీన్ని జనసైనికులు కూడా జీర్ణించుకోలేని పరిస్థితి ఉందన్నారు. చివరకు పవన్‌ను తిట్టుకుంటున్నారన్నారు. పవన్‌ను నమ్మిన యువతను ఎర్రోళ్లను చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబును నమ్మిన వారు ఎవరూ బాగుపడలేదని గుర్తు చేశారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దయ వల్ల నేడు పేద విద్యార్థులు ఉన్నత విద్యావంతులు అవుతున్నారని, ఆయన బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. త్వలరోనే రాష్ట్రంలో ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వైకేవీ అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎన్ వేణుగోపాల్, ఏపీవో ఏవీవీఎస్‌వీ ప్రసాద్, ఏపీఎం జీవీకేడీఎం లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఉప్పు విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ ఎ.రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ పల్లి దివ్యజ్యోతి, ఎమ్పీటీసీ నార్ని శంకరరావు, మార్లపూడి సుబ్బారావు, నార్ని నాగేశ్వరరావు (నాగులు), సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, యాతం సత్యనారాయణ, చిట్టూరి బాపన్న, గ్రామ నాయకులు తిరుమల శ్రీనివాసరావు, తిరుమల సూర్యనారాయణ, బాదం సూర్యచంద్రరావు, కూడవల్లి నరసింహమూర్తి, ఉప్పు సత్యనారాయణ, గోపిశెట్టి సుబ్బారావు, తిరుమళ్ళ నగేష్, సంపతరావు కృష్ణారావు, అడపా వెంకన్నబాబు, ఆరేపల్లి సుబ్బారావు, బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి రూ.28వేల కోట్లు మంజూరు

రాష్ట్రానికి రూ.28వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. విజయవాడ ఇందిరానగర్ స్టేడియంలో రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నాలుగు ఆగమాలను సంపుటీకరించి యజ్ఞాన్ని నిర్వహించడం జరిగిందని, దాని ఫలితమే రూ.28వేల కోట్లని పేర్కొన్నారు. సంకల్పం గొప్పదైతే భగవంతుడు ఆశీర్వదిస్తాడనడానికి ఇదొక నిదర్శనమన్నారు.

40 మంది వృద్ధులకు వైద్య సేవలు



వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలోని 14వ వార్డు మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రత్యేక వైద్యులు రాజేంద్ర 40 మంది వృద్ధులకు వైద్యసేవలు అందించారు. ఆరుగురికి శస్త్రచికిత్సలు, 25 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందిచేందుకు నిర్ణయించారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు వార్డులోనే వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని వార్డు ఇన్‌ఛార్జిలు మిద్దె ఆదినారాయణ, నీరుకొండ పండు అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ సురేఖ, ఏఎన్‌ఎం ప్రశాంతి, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

శంకర మఠంను దర్శించిన రాధామనోహరదాసు



హారతి కార్యక్రమంలో రాధామనోహరదాసు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలోని చిన్నవంతెన వద్ద వేంచేసియున్న జగద్గురు ఆది శంకరాచార్య స్వామి వారి దేవస్థానం శంకర మఠం నందు శనివారం గోపుర నిర్మాణ పర్యవేక్షణకు స్వామిజీ రాధామనోహరదాసు వేంచేశారు. శంకర భగవత్పాదులకు అర్చన, హారతి ఇచ్చారు. శంకర మఠం పర్యవేక్షకులు ధూళిపాల ఆదిత్య, ఓగేటి పండు, ప్రయాగ కిషోర్ శర్మ, మలపాక సుబ్రహ్మణ్య శర్మ, వేమూరి రామం మాట్లాడుతూ ఈ నెలాఖరులో శిఖర ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రేపటినుంచి సువార్త సభలు

పెంటపాడు : పడాల వాక్యజ్యోతి చర్చి ఆధ్వర్యంలో స్థానిక గూడెం అగ్రికల్చర్ మార్కెట్‌యార్డు సమీపంలో సోమవారం నుంచి సువార్త మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘ వ్యవస్థాపకురాలు, ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ తెలిపారు. ఈ సభలకు సంబంధించి పనులు నిర్వహించేందుకు వీలుగా స్థానిక బేతిరెడ్డి అమ్మిరెడ్డి స్థలంలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్టేజీ, పందిళ్లు వేసే పనులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సువార్త సభలకు వరంగల్‌కు చెందిన సేవకులు జెడ్సన్ అబ్రహం, విజయవాడకు చెందిన పాల్ ఇమ్మానియేలు, భీమవరానికి చెందిన ఎం.దేవదాసు, సువార్త గాయకులు జాషువా గరికి తదితరులు హాజరవుతారన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ సభలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాస్టర్లు ఘనరాజు, జాజిరాజు పాల్గొన్నారు.

నేడు క్యాండిల్ ర్యాలీ

తణుకు అర్బన్ : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, మృతులపై సానుభూతిని తెలిపే విధంగా ఆదివారం క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్ కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం పురస్కరించుకుని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి ఈ క్యాండిల్ ర్యాలీని ప్రారంభించనున్నట్లు వివరించారు.

వలంటీర్ వ్యవస్థ.. సీఎం జగన్ మానస పుత్రిక



ఇరగవరంలో వలంటీర్లకు పురస్కారం అందిస్తున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

ఇరగవరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక వలంటీర్ వ్యవస్థ అని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఇరగవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో వలంటీర్లకు పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. మండలంలో 288 మంది వలంటీర్లను సర్టిఫికెట్లు, శాలువా, బ్యాడ్జి, మెడల్‌తో సత్కరించారు. గోటేరులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వలంటీరు సబ్బం జనార్ధన్ కుటుంబ సభ్యులు సత్యనారాయణ, సింహంచలంకు కారుమూరి సేవా సమితి ద్వారా రూ.2 లక్షలు నగదు అందించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో 8533 మందికి రూ.8 కోట్ల 73 లక్షల 10 వేల నగదు పురస్కారాలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. నిరుపేద కుటుంబాలకు సేవ చేసే భాగ్యం వలంటీర్లకు కల్పించారిని, మీతో పాటు మీ కుటుంబ సభ్యులకు మంచి గౌరవం దక్కిందని చెప్పారు. కరోనా కష్టకాలంలో వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచి, అన్ని రాష్ట్రాలు మనవైపు చూస్తున్నాయన్నారు. అలాంటి వలంటీర్ వ్యవస్థకు నాంది పలికి ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదల సొంతింటి కోసం కేటాయిస్తున్న సెంటు భూమిని.. సమాధి కట్టుకోవడవానికి కూడా సరిపోదంటూ చంద్రబాబు అపహాస్యం చేస్తున్నారని, ఆయన హయాంలో ఏనాడైనా పేదలకు సెంటు స్థలం గాని, ఇల్లు గాని ఇవ్వలేదన్నారు. చంద్రబాబుకు త్వరలోనే ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఈ రోజు పండుగ రోజు అని, వలంటీర్లు తాము అందుకున్న పురస్కారాలు కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు తెలియజేసి రానున్న కాలంలో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కొద్ది మందికే లభిస్తుందని దాన్ని సద్వినియోగం చేసుకుంటు సేవలో నిమగ్నమవ్వలన్నారు. కార్యక్రమంలో కారుమూరి సునీల్ కుమార్, ఎంపీపీ అలివేలు మంగ తాయారు, జెడ్పీటీసీ పంపన అంజిబాబు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఎస్సై మోహన్‌రావు తన సిబ్బందితో యనమదుర్రు గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా భీమవరం పురపాలక సంఘం పరిధిలో 'మేరీ లైఫ్, మేరి స్వచ్ఛ్ షెహార్ కార్యక్రమంలో భాగంగా రెడ్యూస్, రియూజ్, రీసైకిల్(ఆర్ఆర్ఆర్)సెంటర్ ను అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బి.జ్యోతి లక్ష్మి, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వేంద్ర ప్రసాద్ శనివారం బీవీరాజు పార్క్ వద్ద ఉన్న 3వ శానిటరీ డివిజన్ ఆఫీస్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు వచ్చే నెల 5 వరకూ ఆర్ఆర్ఆర్ సెంటర్‌లో పాత వస్తువులు, పుస్తకాలు, చెప్పులు, పాత ఆట బొమ్మలు, పాత దుస్తులు,ప్లాస్టిక్ వస్తువులు మొదలైన నిరుపయోగంగా ఉండే వస్తువులను అందజేయాలని తెలియచేశారు. వీటిని అవసరం ఉన్న ఇతరులకు అందిస్తామని తెలిపారు. పట్టణంలో మరో మూడు ప్రదేశాల్లో ఈ ఆర్ఆర్ఆర్ కేంద్రాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయని ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



మంత్రి కొట్టుకు వివరాలు తెలుపుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వైద్యసేవల నిమిత్తం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశించారు. శనివారం ఆసుపత్రి కార్యకలాపాలపై ఆయన సమీక్షించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ పి సూర్యనారాయణ ఆసుపత్రికి సంబంధించిన పలు విషయాలను మంత్రి కొట్టుకు తెలియజేశారు. ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన పది పడకలతో చిన్నపిల్లల ప్రత్యేక వార్డు నిర్మాణం పూర్తయిందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.1.40 కోట్లతో జిల్లాస్థాయి ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్ పూర్తి కావచ్చిందని త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఆసుపత్రికి అభివృద్ధి నిధులకు సంబంధించి రూ.4.50 లక్షలు వసూలు చేశామని, ఇంకా మరో రూ. 4.50 లక్షలు రావల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ ఆసుపత్రికి శానిటేషన్ సూపర్‌వైజర్, సెక్యూరిటీ పోస్టులను త్వరితగతిన నియమించాలని ఆదేశాలిచ్చారు. ఆసుపత్రి అభివృద్ధికి ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నేత్ర వైద్య నిపుణులు జీఆర్ రెడ్డి సౌజన్యంతో ఆసుపత్రికి రెండు ఫ్రీజర్ బాక్సులు సమకూరాయని, వాటిని త్వరలోనే ఉచితంగా వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రి ఇన్‌ఛార్జి ఆర్ఎంఓ డాక్టర్ నాయక్ హాజరయ్యారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం



బాధిత కుటుంబ సభ్యుడికి సీఎం రిలీఫ్ చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి కారుమూరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ఎన్నో రకాల వైద్యసేవలు పొందిపరిచారని అయినప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో నిరుపేదలు ప్రైవేటు వైద్యాన్ని పొందిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనస్సుతో ముఖ్యమంత్రి సహాయ నిధులు విడుదల చేసి ఆదుకుంటున్నారని అన్నారు. ముందుగా అత్తిలి మండలం వరిఘేడు గ్రామానికి చెందిన వ్యక్తి వైద్యసేవలకు రూ.5 లక్షలు, ఇరగవరం మండలం అర్జునుడుపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి వైద్యానికి రూ.1 లక్ష చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, వైఎస్సార్ సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలి



అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు

పెంటపాడు : జగనన్న లే అవుట్‌లలో మరింత ప్రగతి సాధించాలని, లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు పూర్తిస్థాయిలో చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి జీవీకే మల్లికార్జునరావు పేర్కొన్నారు. శనివారం ఆయన పెంటపాడు మండల సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ శాఖ డీఈ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎస్ఎస్‌లో ఉన్న ఇళ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలన్నారు. కాగా లబ్ధిదారులకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందిస్తున్న సంగతిని గుర్తు చేశారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న సాయంతో పాటు, డ్వాక్రా సంఘం ద్వారా రూ. 30 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం అందిస్తామన్నారు. త్వరితగతిన ఇళ్లు నిర్మించేందుకు ఒక కాంట్రాక్టర్ ఏర్పాటు చేసుకొనేలా గ్రామాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. హౌసింగ్ ఏఈ బి.రాజేంద్రకుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు జయరాజు, ప్రసాద్, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరాలు



తాడేపల్లిగూడెంలో శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు



తణుకు పురుషుల గ్రంథాలయంలో యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

తణుకు టౌన్ : గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. తణుకు పట్టణంలోని బ్యాంక్ కాలనీలో ఉన్న పురుషుల శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, చెప్పడం వంటి వాటితో పాటు యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. యోగా గురువు కరుటూరి విశ్వనాథం విద్యార్థులకు యోగాలో మెళకువలు వివరించారు. మహిళా గ్రంథాలయంలో విద్యార్థులతో క్రాఫ్ట్ పేపర్‌పై బొమ్మలు తయారు చేసే విధానం, భగవద్గీత శ్లోకాలును నేర్పించడం, నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం, ఇంగ్లీష్ పదాలకు అర్థాలు తెలియజేయడం, చెస్ బిజినెస్, అంత్యాక్షరి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రీసోర్సు పర్సన్ జె.అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులచే కథలు చదివించడంతో పాటు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలోని గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగి గరికిపాటి బాపయ్య శర్మచే భారత దేశ ఆర్థిక వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి వీరాస్వామి నీతి పద్యాలు, కథలు చెప్పారు. ఎస్.సాల్మన్‌రాజుచే స్పోకెన్ ఇంగ్లీష్, సైన్సు పాఠ్యాంశాలను బోధించారు. మహాశివభట్టు లక్ష్మణరాజుచే జనరల్ నాలెడ్జ్ విషయాలు వివరించారు. పీజీ స్టూడెంట్‌చే ఏపీలో ఉన్న జిల్లాలు, నదులు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు మిఠాయిలు పంచారు.

జస్టిస్ ఏవీ శేషసాయి నియామకంపై హర్షం




తణుకులో హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

తణుకు అర్బన్ : హైకోర్టు తాత్కాలిక సీజేగా జస్టిస్ ఏవీ శేషసాయి నియామకంపై తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఇండియన్ లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ జిల్లాకు చెందిన న్యాయమూర్తి సీజేగా నియామకం కావడం సంతోషకరమన్నారు. ఆయన వృత్తిలో భాగంగా అనేకమైన మైలురాళ్ల వంటి తీర్పులు ఇవ్వడం, పేద, సామాన్య వర్గాల ప్రజలకు అనుకూలమైన తీర్పులు ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చింతపల్లి నాగేశ్వరరావు, న్యాయవాదులు టి.కోటేశ్వరరావు, జి.అంబేద్కర్, వి.సువర్ణరాజు, వెంకట్రావు, డి.భాస్కరరావు, ఇ.చిట్టిమోజేష్, డి.అప్పారావు పాల్గొన్నారు.

ఎడ్వర్డ్ ట్యాంకు అభివృద్ధికి సహకారం

సాక్షి, భీమవరం: భీమవరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎడ్వర్డ్ ట్యాంక్ పార్కు, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఎస్ సాయి దుర్గాప్రసాద్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు కిషోర్, అష్మఖ్ లాల్‌జైన్ కలెక్టర్ పి ప్రశాంతికి వివరించారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రశాంతిని కలిసి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు రూ.35 లక్షల వ్యయంతో పార్క్, వాకింగ్ ట్రాక్ సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి ఎడ్వర్డ్‌ట్యాంక్ అభివృద్ధికి స్వచ్ఛందంగా రోటరీ క్లబ్ ముందుకు రావడం దానికి జూపూడి సంజయ్ వంటి వారు సహకరించడం అభినందనీయమన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రోటరీ క్లబ్ డైరెక్టర్స్ బొండా వెంకట సుబ్బారావు, షేక్ బాబాజీ సాహెబ్ తదితరులున్నారు.

పాలిసెట్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



యంత్రపాటి దశ్వంత్

తాడేపల్లిగూడెం రూరల్ : పెదతాడేపల్లి డాక్టర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయానికి చెందిన విద్యార్థులు పాలిసెట్‌లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ బి.రాజారావు శనివారం తెలిపారు. యంత్రపాటి దశ్వంత్ 4785, నాగసతేజ షణ్ముఖ్ 9113వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ బి.రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రతాప్, ఉపాధ్యాయులు అభినందించారు.

శశి విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం : పాలిటెక్నిక్ ఫలితాల్లో శశి ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ శనివారం తెలిపారు. డి.స్టీఫెన్ 118 మార్కులతో స్టేట్ 51వ ర్యాంకు, కేజేఎస్ఎన్ గణేష్ స్టేట్ 151వ ర్యాంకు, టి.హర్షిత స్టేట్ 269వ ర్యాంకు, జేఎస్ఎస్ విఘ్నేష్ 319వ ర్యాంకు, ఎస్‌కే అజామ్‌ఖాన్ 387వ ర్యాంకులు సాధించారన్నారు. వెయ్యిలోపు స్టేట్ ర్యాంకులు 21 మంది విద్యార్థులు పొందారన్నారు. ఐదువేల లోపు స్టేట్ ర్యాంకులు 41 మంది విద్యార్థులకు, పదివేల లోపు స్టేట్ ర్యాంకులు 64 మంది సాధించారన్నారు. విద్యార్థులకు సంస్థ వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, అకడమిక్ డైరెక్టర్ క్రాంతిసుధ అభినందనలు తెలిపారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

సాక్షి, భీమవరం: పట్టణంలో శనివారం వివిధ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఏపీఆర్‌జేసీ పరీక్షకు 729 మందికి 144 మంది గైర్హాజరుకాగా ఏపీఆర్డీసీ పరీక్షకు 11 మందికి నూరు శాతం హాజరయ్యారు. ఏపీఆర్ఎస్ క్యాట్‌కు 115 మందికి 69 మంది హాజరయ్యారని డీఈవో ఆర్.వెంకటరమణ తెలిపారు.